మాతృదేవోభవ

అది ఒక ఓల్డేజ్‌హోమ్. సరిగ్గా చెప్పాలంటే కన్నపిల్లలు బరువుగా భావించే తల్లిదండ్రులకు నీడను ఇచ్చే ఒక ఆశ్రమం.

రకరకాల వృద్ధులతో నిండి ఉంది ఆ ఓల్డేజ్ హోమ్. చేతి కర్ర పట్టుకుని అతి కష్టం మీద నడిచే వృద్ధులు కొందరయితే, వీల్ చెయిర్‌లో కూర్చుని తిరిగేవారు మరి కొందరు.

కొంతమంది పిల్లలు పరదేశాల్లో జీవిస్తూ - వారి తల్లిదండ్రులను చూడడానికి మరెవరూ లేకపోవడంతో వాళ్ళని ఇక్కడ చేర్పిస్తారు. కొంతమందికి ఆస్తికి కొదవలేదు. ప్రతి సంవత్సరం విహారయాత్రలకి పోతారు పిల్లలతో పాటు. అయితే సంవత్సరానికి ఒక పది రోజులు తల్లిదండ్రులను చూసి పోవాలని ఎందుకో అన్పించదు వాళ్లకి. మరికొంతమంది దేశంలోనే ఉంటారు. అయినా తల్లిదండ్రులను దగ్గర ఉంచుకోలేరు. కారణం వారికే తెలియాలి. కొంతమందికి ఆస్తి ఎంత ఉందో వాళ్లకే తెలియదు. అయితే తల్లిదండ్రుల విషయం వచ్చేటప్పటికి “డబ్బు లేదు”. అందుకే ఓల్డేజ్ హోమ్‌లో మామూలు గదిలో చేర్పిస్తారు.

ఆవిడ పేరు రంగనాయకమ్మ. కొద్ది రోజుల క్రితమే - ఆమె చిన్నకూతురు, అల్లుడూ తీసుకువచ్చి ఆమెను అక్కడ చేర్చారు. అక్కడకు తీసుకువస్తూ కూతురు రంగనాయకమ్మగారికి ధైర్యం చెప్పింది. “ఈ ఓల్డేజ్ హోమ్ వ్యవస్థాపకురాలు - సుబ్బలక్ష్మమ్మగారు - నీకు చిన్నప్పుడు బాగా తెలుసట - మాకు చెప్పింది. నీ మీద చాలా గౌరవం. నిన్ను జాగ్రత్తగా చూస్తానని చెప్పింది. అయినా పదిహేను రోజులేగా. వాడి పెళ్లి అవ్వడం. వాళ్లు అమెరికా వెళ్లిపోవడం-నిన్ను ఇంటికి తీసుకు వెళ్లడం - బెంగ పెట్టుకోవద్దు. మేం వచ్చి చూస్తూ ఉంటాం. బెంగ పెట్టుకోవద్దు”.

నాలుగు, అయిదు రోజులు జరిగి పోయాయి. కూతురు, అల్లుడూ మళ్లీ కన్పించలేదు.

ఏదో ఆలోచిస్తూ కూర్చుంది గదిలో ఒంటరిగా రంగనాయకమ్మ.

అంతలో వాచ్‌మెన్ మూర్తిని ఆవిడ గదికి తీసుకువచ్చాడు.

మూర్తిని చూడగానే ఎంతో సంతోషపడి పోయింది రంగనాయకమ్మ. చెయ్యి గట్టిగా పట్టుకుని మంచం మీద కూర్చోబెట్టుకుని ఆపేక్షగా అడిగింది “బెంగుళూరు నుంచి ఎప్పుడు వచ్చావు?”

“నిన్ననే వచ్చాను ఆంటీ. రమ ఇంటికి వెళ్లాను నిన్ను చూద్దామని. రమ చెప్పింది చిన్నవాడి పెళ్లి కుదిరిందని, ఇంట్లో అంతా హడావిడిగా ఉందని, నీకు ఇబ్బందిగా ఉంటుందని ఇక్కడ చేర్పించామనీనూ. అందుకే ఇక్కడకు వచ్చాను”.

మూర్తి హైదరాబాద్ ఎప్పుడు వచ్చినా దొడ్డమ్మని చూడకుండా వెళ్లడు.

అంతలో సుబ్బలక్ష్మమ్మ అక్కడకు వచ్చింది.

“సుబ్బలక్ష్మి - వీడు నా చెల్లెలి ఆఖరి కొడుకు. బెంగుళూర్‌లో ఉంటాడు-నా పిల్లలు, నా చెల్లెలి పిల్లలూ స్వంత అన్నా, చెల్లెళ్లు గానే పెరిగారు. వీళ్ల చిన్నతనంలో ప్రతి వేసవికాలం శలవులూ మా తండ్రిగారి పల్లెటూరిలోనే గడిపేవారు.

స్వంత అక్కలు, చెల్లెళ్లు, అన్నలు, తమ్ముళ్లలాగే పెరిగారు. నేనంటే అభిమానం. హైదరాబాద్ వస్తే నన్ను చూడకుండా వెళ్లడు. సంతోషంగా పరిచయం చేసింది మూర్తిని - సుబ్బలక్ష్మికి.

“మీ పెద్దమ్మగారు పిల్లల కోసం బెంగ పెట్టుకున్నారు. చేర్పించి వెళ్లారు - అయిదు రోజుల క్రితం. కనీసం ఫోన్ కూడా లేదు”.

**ఆనందకృష్ణ**

"వాళ్ల చిన్న అబ్బాయి పెళ్లి. హడావుడిలో ఉండి ఉంటారు" సర్ది చెప్పబోయాడు మూర్తి.

"మగ పిల్లవాడి పెళ్లి. వీళ్లకు హడావిడి ఏమిటి?" తోసిపుచ్చింది రంగనాయకమ్మగారు.

"ఒరేయ్ – నీ అక్కలు నన్ను ఇక్కడ నుంచి మళ్లీ ఇంటికి తీసుకువెడతారంటావా?" ఆ ప్రశ్న అడిగిందే కాని – ఆమె అనుమానం ఆమె ముఖంలో స్పష్టంగా కన్పిస్తోంది.

"ఎందుకు తీసుకువెళ్ళరు ఆంటీ – అక్కడ పెళ్లి హడావిడి – నీకు ఇబ్బంది అవుతుందే మోనని! మరి ఎక్కడ పెడతారు? అందుకని కొద్ది రోజుల కోసం నిన్ను ఇక్కడ ఉంచారు. పెళ్లి నుంచి తిరిగి రాగానే నిన్ను ఇంటికి తీసుకువెడతారు" ధైర్యం చెప్పాడు మూర్తి.

"నన్ను కూడా పెళ్లికి తీసుకువెళ్లమని బ్రతిమాలాను. అదే మాట – నీకు ఇబ్బంది. ప్రయాణం కష్టం"

"కాదు ఆంటీ రాత్రంతా ప్రయాణం. నీకు ఏ వళ్లు నొప్పులో వస్తే?" సర్ది చెబుదామని చూశాడు మూర్తి.

"రైల్లో ఎ.సి.లో కూర్చుంటే – పడుకుంటే వళ్లు నొప్పులేమిటి? – ప్లైట్‌లో కూర్చుంటే గంటలోపు ప్రయాణం" మళ్లీ తోసిపుచ్చేసింది మూర్తి మాటను.

ఆవిడ మాటలకు నవ్వు వచ్చినా ఆపుకుంది సుబ్బలక్ష్మి. ఈ ఓల్డేజ్ హోమ్‌లో ఎ.సి. గదులున్నా – అవి కాదని మామూలు గదిలో చేర్పించారు – డబ్బు ఖర్చు అని. వాళ్లు ఆవిడను ఎ.సి.లో తీసుకువెడతారా!?

"ఎన్నాళ్లుంటావు? హైదరాబాద్‌లో"

"నాలుగు రోజులు"

"ఉన్నన్ని రోజులూ కన్పిస్తూ ఉండు"

"తప్పకుండా ఆంటీ"

అతను గదిలో నుంచి బయటకు వస్తూంటే – అతనితో బాటు బయటదాకా వచ్చి "ఆవిడని ఈ నాలుగు రోజులూ చూసి వెడుతూ ఉండండి – చాలా బెంగ పెట్టుకుంది. నాకు ఆవిడ చిన్నప్పుడు బాగా తెలుసు. ఎంత దర్జాగా పెరిగిందండీ? ఆమెను చూస్తే జాలి వేస్తుంది..." అంది సుబ్బలక్ష్మి.

"తప్పకుండా కలుసుకుంటానండీ... ప్రతీ రోజూ..." మూర్తికి తన చిన్నతనం జ్ఞాపకం వచ్చింది.

స్కూలు వేసవి సెలవులకు మూయడం, తనూ తన అన్నలూ అమ్మా తాతగారి పల్లెటూరు చేరుకోవడం జరిగేది. కోర్టులు మూయగానే అడ్వకేట్ అయిన తన తండ్రి కూడా అక్కడకు వచ్చేవారు.

దొడ్డమ్మ, బాబాయ్‌గారు, తన అక్కలూ అదే సమయానికి అక్కడకు వచ్చేవారు.

ఎంతో సంతోషంగా గడచిపోయేవి ఆ రోజులు – పొలాల్లో తిరగడం – తోటల్లో మామిడి పండ్లు, కొబ్బరి బొండాలూ – ఒకటే అల్లరి – గాడుపులు అని తాతయ్య కేకలు పెడుతున్నా వినేవారు కాదు. తాతయ్యకు చాలా ఆస్తి ఉండేది. కొబ్బరి తోటలు, మామిడి తోటలు, వరి పొలాలు...

పెద్ద ఇల్లు. అమ్మ, దొడ్డమ్మ రాణీల్లా ఉండేవారు – తాతయ్య భారత, రామాయణ కథలు చెబుతూంటే వింటూ నిద్రపోయేవారు. తన తల్లి పోవడంతో ఆంటీలోనే అమ్మను చూసుకునేవాడు మూర్తి.

అటువంటి దొడ్డమ్మను – అటువంటి పరిస్థితుల్లో చూడవలసి వస్తుందని కలలో కూడా అనుకోలేదు. ఆవిడ దురదృష్టానికి ఒక కన్నీటి చుక్క విడవడం తప్ప తను చేయగలిగిందీ ఏమీలేదు. చాలా బాధపడ్డాడు – హైదరా

బాద్‌లో ఉన్న నాలుగు రోజులూ ప్రతిరోజూ ఆమెను కలుసుకునేవాడు.

మూర్తి వెళ్లిపోయిన తరువాత భోజనం చేసి నిద్రపోవడానికి ప్రయత్నం చేసింది. రంగనాయకమ్మ. నిద్ర రాలేదు. గతం జ్ఞాపకం రావడం మొదలు పెట్టింది. తనకు అప్పుడు 13 సంవత్సరాల వయస్సు. చెల్లెలికి 10 సంవత్సరాలు. ఆ వయసులో ఎంతో ఆనందంగా ఉండేవారు - తనూ చెల్లెలు - సీత. తండ్రి అడ్వొకేట్ - పేరు గాంచిన అడ్వొకేట్ కాకపోయినా - మనిషిగా - మానవత్వం ఉన్న మనిషిగా పేరు గడించారు. డబ్బు ఆర్జించారు - రావుగారితో తన పెళ్లి అయింది. అందగాడు, తెలివైన వాడు అని పేరు. మామగారు "దివాన్ బహదూర్". భర్త రావు న్యాయస్థుడని ఆయన చెప్పిన తీర్పుకు ఎదురులేదని - న్యాయశాఖలో పేరున్న మేజిస్ట్రేట్. మూడు పువ్వులు, ఆరు కాయలుగా మొదలయింది ఆమె వైవాహిక జీవితం. భర్త అంచెలంచెలుగా ప్రమోషన్‌లు సాధించాడు - కొడుకు, ఇద్దరు కూతుళ్లు. చెల్లెలు సీతకు కూడా పెళ్లయింది. ఆమె మామగారు కూడా దివాన్ బహదూర్. పేరు గాంచిన అడ్వొకేట్. ఇద్దరు అక్క చెల్లెళ్లూ స్థిరపడ్డారు - వైవాహిక జీవితంలో. దేనికీ లోటు లేదు... కొడుకు చిన్నతనంలో గ్రాడ్యుయేట్ అయ్యాడు. ఇండియాలో అక్కౌంటింగ్ ట్రైనింగ్ తీసుకుని విదేశాలకు వెళ్లిపోయాడు పై చదువులకి... అంతే కొంచెం కొంచెం దూరమయిపోయారు. వాడు ఉత్తరాలు కూడా వ్రాసేవాడు కాదు... అయితే ఆ బాధను కొంతవరకూ తట్టుకోగలిగారు - భర్తా తనూను.. కారణం వేసవి కాలం - చెల్లెలు, పిల్లలూ తండ్రిగారి పల్లెటూరు వచ్చేవారు. చెల్లెలుకి ఆడపిల్లలు లేరు - దాని పిల్లలు తన కూతుళ్లను స్వంత అక్కలుగా, చెల్లెళ్లగా చూసేవారు. ఎంతకలసికట్టుగా ఉండేవారు? ఆ రోజులు తలుచుకుంటూంటే తనకే ఆశ్చర్యంగా ఉంటుంది.

తన పిల్లలు అందగత్తెలు, తెలివైన వాళ్లు - వాళ్లకు మంచి సంబంధాలే వస్తాయి అన్న ధైర్యం. కొంచెం అహం కూడానేమో! తనకే అనుమానం.

అనుకున్నట్టుగానే వాళ్లిద్దరికీ మంచి సంబంధాలే వచ్చాయి. అందులో చిన్న కూతురి భర్త తనకు చాలా దగ్గర చుట్టరికం కూడా. మనుమల్ని ఎత్తుకుంది - వాళ్లూ పెద్దవాళ్లయిపోయారు - వాళ్ల చిన్నతనం ఇప్పటికీ కళ్లకు కట్టినట్లుంది. వాళ్లు సెలవులకు రావడం - అమ్మమ్మా అంటూ తన చుట్టూ తిరగడం, వాళ్లకి ఏం కావాలంటే అది వంట మనిషి చేత చేయించి పెట్టడం - ఎంతో ఆనందంగా ఉండేది.

మనుమలు, మనమరాళ్లూ పెద్ద అవడం, ఒక్క ఆఖరి మనుమడుకి తప్ప తక్కిన వాళ్లందరికీ పెళ్లిళ్లు అయిపోయాయి. వాళ్లు భర్తలతో, భార్యలతో పై దేశాలకు వెళ్లిపోయారు. ఎంత సేవ చేసింది పిల్లలకు, మనుమలకు? రావుగారు పిల్లలకు ఏది కావాలంటే అది ఇచ్చేవారు. అల్లారుముద్దుగా పెంచారు. దానికి వాళ్లు ఋణం తీర్చుకుంటారు అనుకునేది. ఆయన రిటైర్ అయిపోయిన తరువాత పిల్లలు వచ్చేవారు సెలవులకి. పిల్లల దగ్గరకు వెళ్లడం వీరికి అలవాటు లేదు. వాళ్ళే వచ్చేవారు.

ఆనందంగా జరుగుతున్న తన జీవితం - ఒక్కసారిగా విషాదాంతంగా మారిపోయింది ఒక రోజు.

ఆ రోజు సాయంత్రం మామూలుగా స్నేహితులతో పార్కుకి వెళ్లివచ్చారు. మామూలుగా నిద్రపోయారు... అయితే పొద్దున అయిదున్నర గంటలకు లేచే ఆయన ఆరు గంటల వరకూ

లేవలేదు – బద్ధకంగా ఉందేమో ఎందుకు లేపడం అని తనూ వూరుకుంది – ఆరున్నర అయింది – అయినా నిద్రలేవలేదు – తనకూ తోచక నిద్ర లేపుదామని ప్రయత్నించింది. లేవలేదు... ఊ... అని కూడా అనలేదు. భయం వేసింది. వెంటనే పని మనిషితో ప్రక్కన ఉన్న చెల్లెని కొడుక్కి కబురు పంపింది. పరిగెట్టుకొచ్చాడు, దొడ్డమ్మ ఇంటికి – తనూ ప్రయత్నం చేశాడు ఆయన్ను నిద్ర లేపడానికి. ఎంతకీ లేవకపోవడంతో అర్థమయింది అది శాశ్వత నిద్ర అని. అయినా ఆమెకు ఆ మాట చెప్పలేక పోయాడు. ప్రక్క ఇంట్లో ఉన్న డాక్టర్‌ని పిలుచుకువచ్చాడు – ఆయనకు చెప్పక తప్పలేదు – రావుగారు ఇంకలేరు అని. గొల్లుమంది. తన చెల్లెలు – చెల్లెలి కొడుకు కుటుంబం ప్రక్కనే ఉంటారు. పరుగెట్టుకు వచ్చారు...

జరుపవలసిన తతంగం అంతా చెల్లెలి కొడుకే చేశాడు. తన కొడుకు దేశంలో లేడు. ఇంచుమించుగా వాడిని మరచిపోయారువాళ్లు. కూతుళ్లు, అల్లుళ్లూ మర్నాటికి చేరుకున్నారు. నాతో రా అంటే నాతో రా అని పోటీపడ్డారు వాళ్ళిద్దరూ – తనను తీసుకువెళ్లడానికి. లోపల భర్తపోయిన బాధను కొంతవరకూ మరిచి పోయేలా చేసాయి వాళ్లమాటలు.

అలా ఆరంభమయింది తన ఏకాంత జీవితం. తల్లికి అడుగులకు మడుగులొత్తారు ఇద్దరు కూతుళ్ళూ. "నా దగ్గర ఉంటుందిలే అమ్మ – ఇంకొన్ని రోజులు" అని పోటీ పడే వారు వాళ్లిద్దరూ. ఏమీ లోపం లేకుండా చూసే వారు ఆమెను.

కొద్ది సంవత్సరాలు గడిచిపోయాయి. మెల్లిగా మొదలయ్యాయి సణుగుళ్లు. పొరబాటున తను తింటున్నది ఏదో కింద పడితే "నీ గదిలో కూర్చుని తినొచ్చుగా – అక్కడయితే కింద ప్లాస్టిక్ షీట్ వేశాం – తీసి దులిపి వెయ్యవచ్చు. ఇక్కడ అయితే ఇల్లంతా చీమలు" అనేవారు.

నీళ్లు కింద పడితే "జారిపడతాం ఏ కాలో విరుగుతే అదొక ప్రోబ్లమ్"

నీళ్లు కింద పడితే తను తుడవడానికి ప్రయత్నిస్తే "నీకెందుకు శ్రమ! నేవున్నానుగా"

ప్రతి మాటలోనూ, చేతలోనూ – 'మన మీద కూర్చుంది" అనే భావాన్ని వ్యక్తం చేసే వారు.

తను చేయగలిగింది ఏమిటి? ఎక్కడకు పారిపోగలదు? "పాపీ చిరాయువు అన్నట్టుగా దేవుడు తనను తీసుకువెళ్లడం లేదు అనుకునేది – అయితే వెంటనే "ఛీ – పిల్లలను అనుమానించడం తప్పు"... వాళ్లు పెద్దవాళ్లవుతున్నారు. నేను సాయం చేసేది లేదు – పైగా వాళ్లకు చాకిరీ అన్పించేది. మళ్లా ఒక ఆలోచన – అంత డబ్బుంది వాళ్లకు – పైగా తన ఆస్తంతా కూడా వాళ్లకే. ఇంకొక నౌకర్ని తన కోసం పెడితే – మళ్లీ ఒక అడ్డు ఆలోచన – నౌకర్లు సరైన వాళ్లు కాకపోతే ఏదో ఒక రోజు ఇంట్లో వున్నవన్నీ పట్టుకుపారిపోతే – అదో గొడవ – ఆలోచనలతో సతమతమవుతూ ఉండేది.

క్రమంగా రోజులు జరుగుతూంటే ఆమె ఎవరి ఇంట్లో ఎన్ని రోజులుండాలి – వంతులు వేసుకునేవారు ఇద్దరు పిల్లలూ – ముందు తనకు అర్థం కాలేదు సరిగ్గా మూడు నెలల కొకసారి తను ఇల్లు మారేది. ఒక్కరోజు కూడా ఇటూ అటూ అయ్యేది కాదు. మళ్లీ తనలో ఆలోచన. అదీ మంచిదే – పాపం ఒక్కర్తే ఎంత కాలం చేయగలదు. వాళ్లకూ కొంత శ్రమ తగ్గుతుంది అని సరిపెట్టుకుంటూ ఉండేది. పిల్లలు కష్టపడుతున్నారంటే అదొక విధమైన జాలి.

అయితే ఒకటి రెండుసార్లు వాళ్ల ఇద్దరి మధ్యా జరుగుతున్న టెలిఫోన్ సంభాషణలు ఆమె అభిప్రాయాల్ని పూర్తిగా మార్చేశాయి.




"సరేలే – అమ్మను పది రోజులు నేను ఇక్కడ ఎక్కువ అట్టే పెట్టుకుంటాను. వచ్చేసారి నువ్వా అట్టిపెట్టుకుందువుగాని లే" అంటోంది చిన్నకూతురు పెద్దకూతురితో తన చెవుల్ని తనే నమ్మలేకపోయింది –ఖిన్నురాలైపోయింది అయినా ఆ మాటలు విననట్టుగానే ప్రవర్తిం చింది.

మరొకసారి చిన్నకూతురు అక్కతో అంటోంది ఫోన్‌లో "కిందటిసారీ అంతే చేశావు. మా ఆరోగ్యాలు అంతంతే కదా! ఇలా ప్రతిసారీ అమ్మను ఇక్కడ ఎక్కువ రోజులు వుంచేయడం బాగా లేదు".

తన చెవులకి శూలాల్లా గుచ్చుకున్నాయి ఆ మాటలు. తన పిల్లలకి తను అంత బరువైపోయానా!? నిశ్చేష్టురాలు అయిపోయింది – రంగనాయకమ్మ.

మరొక రోజు చిన్నకూతురే ఫోనులో అంటోంది – అక్కతో.

"మనమూ పెద్దవాళ్లం అవుతున్నాం. మన ఆరోగ్యం కూడా అంతంతే. ఇలా అమ్మని ప్రతి మూడు నెలలకూ పిల్లి పిల్లలా తిప్పడం బావుండదు. అందుకని ఆమెను ఏదో ఒక ఓల్డేజ్ హోమ్‌లో చేర్పిస్తే బావుంటుంది అనుకుంటున్నాము".

... అవతల ప్రక్క నుంచి అక్క ఏమందో తెలీదు కానీ చిన్న కూతురే అంటోంది "ఖర్చు అంటారా!? చూద్దాంలే అంత ఎక్కువ కాకుండానే చూస్తాం. ఇద్దరూ చెరిసగం చేసుకుంటే అంత ఎక్కువ అవ్వదు".

...

"ఆ... మరో విషయం. మా చిన్నవాడి పెళ్లి స్థిరపడింది...

"ఆ... మేం ఎక్కడ వెతికాం? వాడే అక్కడే చూసుకున్నాడు. ఇక్కడి వాళ్లే. హిందువులే. పెళ్లి సంబంధం కూడా నిశ్చయించి మాతో చెప్పారు అమ్మాయి తల్లిదండ్రులు. వచ్చే నెలలోనే ముహూర్తం"

అమ్మని ఎలాగా తీసుకువెళ్లం. మీరు కూడా పెళ్లికి వస్తారు. అమ్మను ఎక్కడ పెడదామా

అని ఆలోచించాం. ఏమనుకున్నామంటే ఇది అదనుగా తీసుకుని అమ్మను ఏదో ఒక ఓల్డేజ్ హోమ్‌లో చేర్పిద్దాం".

"ఆ రేపొద్దునే వెళ్దామనుకుంటున్నాము - మళ్ళీ ఫోన్ చేస్తానులే".

"అమ్మా చిన్నవాడి పెళ్లి కుదిరింది" చెప్పింది. తనకేమీ తెలీనట్టు "సంతోషం" అంది రంగనాయకమ్మ.

"పెళ్లి మళ్లీ వచ్చే నెలలోనే... రేపటి నుంచి హడావుడి మొదలవుతుంది. నేనూ అక్కా ఏమనుకుంటున్నామంటే నిన్ను మంచి ఓల్డేజ్ హోమ్‌లో పెడదామనుకుంటున్నాం. మళ్లీ పెళ్లి నుంచి రాగానే ఇంటికి వచ్చేద్దువుగాని"

"అది కాదే - వాడు మన ఇంట్లో అందరి కంటే చిన్నవాడు. ఆఖరి పెళ్లి ఆ తరంలో. నేనూ వస్తానే"

"లేదమ్మా - ప్రయాణాలు నీకు ఇబ్బంది. నీకేమైనా ఏ నలత అయినా వస్తే - అదొక ఇబ్బంది.

ఎలాగైనా పెళ్లి అవ్వగానే రిసెప్షన్ ఉం టుంది - అప్పుడు చూద్దువుగాన్లే కోడల్ని"

ఏమనలేకపోయింది రంగనాయకమ్మ.

అలా ఆరంభమయింది ఆవిడ వృద్ధుల ఆశ్రమ జీవితం...

ప్రక్క ఆఫీసు గదిలో నుంచి రెండు గంటలు విన్పించాయి... ఎప్పుడో ఒక కునుకు తీసింది.

ఆ రోజు సుబ్బలక్ష్మమ్మ రంగనాయకమ్మను పక్క గదిలో ఉన్న శాంతమ్మగారికి పరిచయం చేసింది "నీకు చెప్పాను కదా! రంగనాయ కమ్మగారు..."

రంగనాయకమ్మగారితో అంది ఈవిడ "శాంతమ్మ" గారు. ఈ సంస్థకి నేనేంతో - ఈమె అంతకంటే ఎక్కువే. నువ్వు వచ్చేముందే పిల్లలతో పైవూరు వెళ్ళారు ఇవేళే వచ్చారు"

"మిమ్మల్ని గురించి సుబ్బలక్ష్మమ్మ నాతో చెప్పింది - మీరూ తన చిన్నప్పటి నుంచి స్నేహి తులట" శాంతమ్మ మాటలకు...

"అవునండి" అందే కానీ ఏమీ చెప్పిందో ఊహించలేకపోయింది. తనకు అది అవసరం లేదు కూడా.

శాంతమ్మగారి వైపు ఒకసారి చూసింది పూర్తి ఏకాగ్రతతో. ఎంత ఆకర్షణ ఉంది ఆ ముఖంలో? ప్రశాంతమైన చూపులు - ఎంత అందమైన మొహం!! తల ముగ్గుబుట్ట అంటే ఆమె అందమైన కేశాల్ని అవమానించడమే. మచ్చుకైనా ఒక్క రంగు వెంట్రుక లేదు. ఆమె అందమైన ముఖానికి మరింత అందాన్ని ఇస్తున్న కళ్లజోడు - దానికి కిందకు పడకుండా ఉండడానికి బంగారు గొలుసు. తనకంటే కొంచెం వయసులో చిన్నదే అయి ఉంటుంది. ఆ వయసులో అంత అందమైన మనుషులు అరుదే. ఎనభై వసంతాలు చూసి వుంటుంది - అయినా ఆ గడిచిన సంవత్సరాల చిహ్నాలు మచ్చుకైనా లేవు - చిన్న చిన్న గాలిబీటల్లా - తల వెంట్రుక వాసిగీతలు ఉన్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే - ఎప్పుడో సాలార్‌జంగ్ మ్యూజియంలో చూసిన పాలరాయి బొమ్మ జ్ఞాపకం వచ్చింది ఆమెకు. అంత వయసు లోనూ మలచిన పాలరాతి బొమ్మలావుంది. ఆవిడ జీవితంలో విషాదాన్ని చూడలేదేమో - లేకపోతే అంత వయస్సులో అంత ప్రశాంత మైన ముఖం ఉండదు.

ఒక రోజు సాయంత్రం రంగనాయకమ్మ - శాంతమ్మగారి గదిలో కూర్చుంది. వాళ్లిద్దరూ ఏదో మాట్లాడుకుంటున్నారు. అక్కడకు వచ్చింది - అయిదారు సంవత్సరాల చిన్నపాప "హేపీ బర్త్‌డే బామ్మా - అంటూ తన చేతిలో

ఉన్న ఎఱ్ఱగులాబీల గుత్తిని ఆమెకు అందిస్తూ ఆమె వళ్లో వాలిపోయింది - ఎంతో ఆప్యాయతతో...

బామ్మగారు ఆ పిల్లను ముద్దులతో ముంచేస్తోంది - ఆ గదిలో మరొక మనిషి ఉందనే సంగతి మర్చిపోయారు. అప్పటికి మెల్లిగా చేరుకుంది - ఆ పాప తల్లి - వస్తూనే "శ్రేయా - నువ్వు అలా బామ్మగారి మీద కూర్చొని తొక్కేస్తే - బామ్మగారికి వళ్లు నెప్పులు వస్తాయమ్మా"

"ఏం పరవాలేదు మమ్మీ - బామ్మనన్నేమీ అనదు కదా - బామ్మా?" బామ్మవైపు చూసింది.

"నిన్నెందుకు అంటానమ్మా? - మా వజ్రాలమూట" మరోమాటు గట్టిగా ముద్దు పెట్టుకుంది.

రంగనాయకమ్మ - ఒకసారి బామ్మ, కోడలు, మనుమరాలు ముగ్గురువైపూ చూసింది.

ఆశ్చర్యపోయింది... ఒకర్ని మించిన అందం మరొకరిది.

"మా కోడలు - శారద" పరిచయం చేసింది శ్రేయ తల్లిని రంగనాయకమ్మకి.

ఆమె విగ్రహం రంగనాయకమ్మను ఎంతో ఆకర్షించింది. శ్రేయ వైపు ఒకసారి చూసింది. రంగు తల్లిది. కన్నూ, ముక్కూ బామ్మవి. తల్లి అందం తక్కువనికాదు... అంతకంటే కోడలు కొంచెం తక్కువే.

ఆ పసి ముఖంలో తల్లి శారద ముఖంలో సౌమ్యం, నమ్రత - చదువుల సరస్వతే కన్పిస్తుంది.

ఏదో ఏదో ఆలోచిస్తోంది.

"బామ్మగారూ ఇవేళ మా బామ్మగారి బర్త్‌డే. మీరూ పళ్లు తినండి" అంటూ చేతికి ఇచ్చింది కొన్ని ద్రాక్ష గుత్తులు. ఆ పళ్లు తీసుకుని శ్రేయను ముద్దుపెట్టుకోలేకుండా ఉండలేకపోయింది రంగనాయకమ్మ. తన మనుమరాళ్లు జ్ఞాపకం వచ్చారు. ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు.

శారద భర్త ఆనంద్ వచ్చాడు. వస్తూనే - ఒక షాల్ ఇచ్చాడు అమ్మకు.

"ఇవన్నీ ఎందుకు బాబూ - పళ్లు చాలవూ?

"లేదండీ మీ అబ్బాయికి అలవాటేగా".

ఆనంద్‌ని కూడా పరిచయం చేసింది శాంతమ్మ రంగనాయకమ్మగారికి. 'శ్రేయా నీ బర్త్‌డేకి నా గిఫ్ట్. ఒక చెక్కు వ్రాసి ఇచ్చింది - బామ్మ మనుమరాలికి. "ఎందుకండీ ఇవన్నీనూ" శారద అంది.

"నా మనుమరాలమ్మా" అంది శాంతమ్మ.

మళ్లీ ఆ రోజు రంగనాయకమ్మగారికి నిద్ర పట్టలేదు. కారణం... శాంతమ్మగారి సంతోషమైన కుటుంబాన్ని చూసి అసూయకాదు- అటువంటి కుటుంబాలు నిజంగా ఉంటాయా? అని ఆశ్చర్యంతో.

రోజులు గడుస్తున్నాయి. మనుమడు పెళ్లి అయివచ్చాడు - ఇంటికి తీసుకువెళ్లి కొడుకుని, కోడల్ని చూపించింది. చూపించి, "వీళ్లతో బాటు మేము సింగపూర్ వెడదామనుకుంటున్నాం. పెద్దవాడి దగ్గర ఓ నెల్లాళ్లు ఉండి వస్తాం" అంది. మళ్లీ ఓల్డేజ్ హోమ్‌లో వచ్చి పడింది రంగనాయకమ్మ.

ఆరోజు శాంతమ్మ అంది "నాలుగు రోజుల పాటు పిల్లలతో ఊటీ వెడుతున్నాం. రమ్మని ఒకటే పట్టు - వెళ్లకపోతే చిన్న బుచ్చుకుంటారు"

మర్నాడు పొద్దున్నే కొడుకు, కోడలు, మనుమరాలూ వచ్చి ఆవిడను తీసుకువెళ్ళారు.

ఒక్కర్తె గదిలో కూర్చుని, ఏం తోచక సుబ్బ

లక్ష్మమ్మను పిలిచి మాట్లాడుతూ కూర్చుంది రంగనాయకమ్మ.

'ఎంత ఆనందమయిన కుటుంబం. ఎంత సంతోషంగా కన్పిస్తారు. కోడలు కాదు... కూతురు కంటే ఆప్యాయంగా చూస్తుంది శారద అత్తగారిని... అంత అన్యోన్యం కథల్లో, సినిమాల్లోనే కన్పిస్తుంది..."

రంగనాయకమ్మ మాటలకు "ఊ" అని ఊరుకుంది సుబ్బలక్ష్మమ్మ.

"అందుకనే అంటారు మనవాళ్లు – కొరివి పెట్టడానికి ఒక కొడుకు ఉండాలి అని... కూడ బెట్టి అన్నంతింటూ – ఆఖరి రోజులు కొడుకు చేతుల్లో పోతే ఎంత బావుంటుం ది?..." తనకు కొడుకు ఉండి కూడా ఆ అదృష్టానికి నోచుకో లేదన్న బాధ ఆమె ముఖం మీద కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.

మళ్లీ రంగనాయకమ్మే అంది... "వాళ్లు అంత అన్యోన్యంగా ఉంటారు కదా! ఆమెను ఇక్కడ ఎందుకు చేర్చారు?" ప్రశ్న అడిగిందే కానీ ఎందుకు అడిగానా అని నొచ్చుకుంది.

జాలిగా నవ్వి, "ఊ" అని ఊరుకుంది జవాబుగా సుబ్బలక్ష్మమ్మ.

"నవ్వుతావు ఎందుకు?"

జవాబు లేదు.

మళ్లీ రంగనాయకమ్మ అంది

"అందుకనే అంటారు – ఒక్కచోటే ఎక్కువ కాలం కలిసి ఉంటే అత్తా కోడళ్ళ మధ్యలో మనస్పర్థలు రావచ్చు" అని...

"ఏం మాట్లాడవేం"

రంగనాయకమ్మ ప్రశ్నకు సుబ్బలక్ష్మమ్మ నోరు విప్పింది.

'ఆనంద్ ఆమె కొడుకూ కాదు – శారద ఆమె కోడలూ కాదూ – శ్రేయ మనుమరాలు అసలేకాదు. అయినా వాళ్లు ఆమెకు అంతకంటే దగ్గరవాళ్లు –ఆమెకు మూడు ప్రాణాలు – వాళ్లు ముగ్గురూను"

నమ్మలేకపోయింది రంగనాయకమ్మ "ఆ" అంది.

వాళ్ల కథ చెప్పడం మొదలు పెట్టింది సుబ్బలక్ష్మమ్మ.

అవును అదొక విచిత్రమైన సంబంధం – దేముడి లీల అనాలి – నాకూ ఆ కుటుంబం నలభై సంవత్సరాల నుంచి తెలుసు. శాంతమ్మగారు చాలా సన్నిహితురాలు. ఆమె భర్త పేరు రమణారావు. ఏదో కంపెనీకి ప్రెసిడెంట్, డైరెక్టర్. డబ్బు, హోదా – ఒకే కొడుకు – స్వంత కూతురికంటే ఆప్యాయంగా చూసుకునే కోడలు. ఒక చిన్నపాప.

కొడుకు పేరు కృష్ణ – అతనికి తల్లిదండ్రుల మీద ఎంత ప్రేమ అంటే – పైదేశాల్లో ఉద్యోగాలు వచ్చినా తల్లిదండ్రులను వంటరివాళ్ళుగా వదిలి వెళ్లలేదు. రమణారావుగారు రిటైర్ అయిపోయారు. నాలుగు బెడ్రూమ్‌ల ప్లాటు కొనుక్కొని ఇక్కడే స్థిరపడిపోయారు. ఎవరి దిష్టి తగిలిందో ఏమో వారి ఆనందమయ జీవితం – ఒక్క క్షణంలో చీకటిగా మారిపోయింది – ఏదో పిక్నిక్ వెళ్లిన కొడుకు, కోడలు, మనుమరాలు క్షణంలో శవాలుగా మారిపోయారు – రోడ్డు ప్రమాదంలో.

వాళ్ల జీవితాలు చీకటిమయం – తట్టుకోలేకపోయారు ఆ విధి వ్రాతను. అది మొదలు వారి జీవితమే మారిపోయింది. బయటకు రావడం మానేశారు.

అదే రోజుల్లో ఆనంద్, శారద ఆ బిల్డింగ్‌లో సరిగా వీళ్లకు ఎదురుగా ఉన్న ప్లాట్‌లోకి వచ్చారు. కొత్తగా పెళ్లయింది... ఏదో కంపెనీలో డైరెక్టర్. చిన్న వయసులో డైరెక్టర్ అయ్యా




డు. శారదది చాలా చురుకైన, ఉల్లాసమైన మనస్తత్వం. ప్రతి వారితో స్నేహం చేస్తుంది. పెద్ద వాళ్లంటే గౌరవం... పిల్లలంటే ముద్దు. ఆ ఫ్లాట్స్‌లో ఉన్న కన్పించిన పిల్లల్ని అందర్నీ ఆడించేది. కథలు చెప్పేది – పిల్లలందరికీ చాలా దగ్గరయిపోయింది.

అందరితో స్నేహం చేసింది కానీ ఎదురుగా ఉన్న ఫ్లాట్‌లోని శాంత, రమణారావుగార్లతో పరిచయం చేసుకోలేకపోయింది. ఆమె మనస్తత్వానికి అది విరుద్ధం. ఎప్పుడూ తలుపు వేసి ఉండేది. ఎలా? వాళ్లను కలసుకోవడం!?

ప్రక్కవాళ్ల దగ్గర్నుంచి తెలుసుకుంది – వారి విషాద కథ.

ఒకరోజు చొరవ చేసుకుని వాళ్ల ఫ్లాటు గంట కొట్టింది. రమణారావుగారు తలుపు తీసారు.

తన తండ్రి బ్రతికి ఉంటే ఆయన వయస్సు అనుకుంది.

'నమస్కారమండీ – మేము ఎదుటి ఫ్లాట్‌లోకి వచ్చాం. నా భర్త ఆనంద్... కంపెనీలో డైరెక్టర్" పరిచయం చేసుకుంది – నా పేరు శారద

"లోపలికి రామ్మా..."

తన కొడుకు, కోడలూ పోయి నెలలు అయ్యాయి. ఎవరూ వచ్చి పలుకరించడానికి కూడా సాహసం చేయలేదు. కారణం... వారి మరణం వాళ్ల మీద చూపిన ప్రభావం...

అంతలో శాంతమ్మ వచ్చింది అక్కడకు.

"చూడు శాంతా – మన ఫ్లాట్ ఎదుటి ఫ్లాట్‌కి వచ్చారట –పేరు శారద –భర్త ఆనంద్".

ఎందుకో శారదను చూడగానే కోడలు గుర్తుకు వచ్చింది శాంతమ్మకి. ఇంచుమించు ఒకే వయస్సు – కొంచెం చిన్నది అయ్యుండొచ్చు.

"కూర్చొమ్మా..."

"హాల్లో అన్ని చోట్లా కొడుకు, కోడలు, మనుమరాలి ఫొటోలు... తలుపు ముయ్యకుండా ఉన్న గది నిండా బయటకు కనిపించే

బొమ్మలు - చిన్న పిల్లల ఆట వస్తువులు...

వాటివైపు మళ్లింది శారద చూపు... కళ్ల లోంచి అనుకోకుండా ఒక రెండు కన్నీటి చుక్కలు.

వాళ్లెవరో ఆమెకు తెలీదు - అయినా!?

"ఇంకెవరు ఉన్నారమ్మా - ఇంట్లో" శాంతమ్మ ప్రశ్నించింది.

జవాబుగా ఒక నిట్టూర్పు - "నాకు - నా అనే దగ్గర చుట్టాలెవరూ లేరండీ... ఆయనకూ అంతే. ఆయనకు నేను - నాకు ఆయనా - అంతే"

"అంతేనమ్మా - భగవంతుడి లీలను అర్థం చేసుకోవడం కష్టం - కొడుకు, కోడలూ, మనమరాలు - ముగ్గుర్నీ పోగొట్టుకున్నాం. ఈ సత్యాన్ని జీర్ణం చేసుకోలేకపోతున్నాం - అటువంటి సమయంలో మాయింటికి ఎదురుగా మిమ్మల్ని తీసుకువచ్చాడు" ఎందుకు అలా అందో తెలీదు కాని - ఆ మాట అన్నప్పటి నుంచీ శారద ఆమెకు దగ్గరయిపోయింది. కొద్ది రోజుల్లోనే శారద ఆమెకు ఆత్మీయురాలు అయిపోయింది. ఆనంద్ రమణారావు గారికి దగ్గరయిపోయాడు. వారు నలుగురూ ఒకే కుటుంబంలా అయిపోయారు. రమణారావు గారు, శాంతమ్మ ఇంటి బయటకు రావడం మొదలుపెట్టారు. మళ్లీ మామూలు మనుషులు అయ్యారు.

శారద - "మిమ్మల్ని అత్తయ్య అనాలనిపిస్తోంది మీకు అభ్యంతరం లేకపోతే" శాంతమ్మతో అంది.

"అంతకంటేనామ్మా - నేనే అందామనుకుంటున్నాను - నన్ను అత్తయ్య అని పిలవమని" ఆవిడ మనస్తత్వానికి తగిన కోడలు - స్నేహాలు చుట్టరికాలుగా మారాయి.

కొద్ది నెలలు గడిచాయి. ఒక రోజు శారద శాంతమ్మతో చెప్పింది -"తను తల్లి కాబోతున్నా"నని.

ఒక్కక్షణం ఆగలేదు - 'విన్నారా? మన కోడలు త్వరలోనే మనకు ఒక మనువణ్ణో, మనుమరాల్నో ఇవ్వబోతోంది".

ఆ మాట వినగానే - "మనకు పోయిన మనుమరాలు మళ్లీ తిరిగి వస్తుంది - ఐ యామ్ షూర్"

ఆ రోజు శాంతమ్మగారు తన చేతుల్తో అన్నం పెట్టింది - కోడలికి - కొడుక్కి.

అది మొదలు - ప్రతిరోజూ ఒక గంటసేపు శారదకు పాఠాలు చెప్పేది - తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి. ఒకరోజు ఆవిడ చెప్పింది శారదకు - "చూడమ్మా స్త్రీకి పెళ్లి కాగానే ఆమెకు సంఘంలో ఒక అంతస్తు పెరుగుతుంది. పిల్లలు కలగగానే - ఆమె అమ్మ అవుతుంది - అందర్నీ మరిపించేది అమ్మ. పిల్లల కోసం ప్రాణం కూడా ఇవ్వడానికి సిద్ధపడుతుంది అమ్మ. కానీ ఆ అమ్మ కోసం తన కూతురు ప్రాణం ఇవ్వడానికి సిద్ధ పడ్తుందా? తనకు తన సంతానం ప్రధానం - తన పిల్లల కోసం ప్రాణం ఇవ్వడానికి సిద్ధపడ్తుంది - ఆ విషయం మర్చిపోకుండా ఉండడం కోసమే మనవాళ్లు అంటారనుకుంటాను "మాతృదేవోభవః". ఇది జ్ఞాపకం పెట్టుకోమ్మా. నీ కన్నతల్లిని ఎప్పుడూ మర్చిపోవద్దు. ఆమె భౌతికంగా ఇక్కడ లేకపోయినా స్వర్గంలో ఉన్న ఆమె దీవెనలు నీకు ఎపుడూ ఉంటాయి".

శారదకు ఆ మాటల్తో శాంతమ్మ మరీ దగ్గర అయిపోయింది.

నెలలు గడుస్తున్నాయి. శారద కడుపులో పాప పెరుగుతోంది. ఆమెను చూసిన వారందరూ ఆమెకు పాప పుడ్తుంది అని చెప్పినవాళ్లే.

కన్న కూతురిలా చూసుకుంది శాంతమ్మ

శారదను - పత్యాలు, జాగ్రత్తలూ... ఒకటే మిటి!?

సమయం రానే వచ్చింది - ఒక చక్కటి పాపకు జన్మనిచ్చింది శారద -

పాపకు పేరు మీరే పెట్టాలి అని వత్తిడి చేశారు - ఆనంద్, శారద. తప్పలేదు రమణా రావు, శాంతమ్మగార్లకు. నామకరణం చేశారు - "శ్రేయ".

అది మొదలు - రమణారావుగారి ఇల్లు మళ్లీ కళకళలాడడం మొదలు పెట్టింది.

ఆనంద్ ఆఫీస్‌కి వెళ్లింది మొదలు మళ్లీ తిరిగి వచ్చేవరకూ - శారద, శ్రేయ వాళ్ల ఇంట్లోనే, రమణారావుగారికి మనుమరాలితో ఆడిన ఆటలన్నీ గుర్తుకు వచ్చేవి - ఏనుగు అంబారీ అనేవారు, గుఱ్ఱపుస్వారీ అనేవారు శ్రేయ నవ్వులతో వాళ్లను మరో లోకాలకి తీసుకువెళ్లిపోయేది - శ్రేయ తుమ్మితే - డాక్టరు దగ్గరకు పరుగుపెట్టేవారు - రమణా రావుగారు. "ఆయనకి ప్రతి చిన్న విషయానికీ భయమే". చిట్కా వైద్యం చేసేది బామ్మ.

నాలుగు సంవత్సరాలు గడిచిపోయాయి.

ఆరోజు పొద్దున్న "ఆనంద్, శారదా" గట్టిగా కేకపెట్టింది శాంతమ్మగారు

పరుగెట్టుకువెళ్లారు ఇద్దరూ వాళ్ల ఫ్లాట్‌కి - తిన్నగా రమణరావుగారి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళారు. ప్రక్కనే డాక్టర్ ఉన్నాడు - తలవంచేసు కున్నాడు.

"ఏమయింది డాక్టర్? - ఆనంద్ అడిగాడు - కంగారుగా"

అయామ్‌సారీ - నేను చేయగలిగింది ఏమీలేదు.

"మాసిక్ కార్డియాక్ ఎరస్ట్" - నిద్రలోనే పోయారు. కనీసం నాలుగు అయిదు గంట లయి ఉంటుంది.

అప్పుడు టైమ్ ఉదయం ఆరుగంటల యింది - అంటే ఆయన ఆఖరి శ్వాస సుమారు ఒంటిగంటకు..."

కొట్టేసిన చెట్టులా పడిపోయింది శాంతమ్మ - శారద ఆమెను వళ్లో పడుకోబెట్టుకుంది.

ఆనంద్ స్వంత కొడుకులా చేయవలసిన కర్మకాండ పూర్తిచేశాడు - శాంతమ్మ కొడుకు, కోడలూ మనుమరాళ్ల మరణాన్ని తట్టుకోగలి గింది - ఆనంద్, శారదా, శ్రేయ ఆ గాయాన్ని కొంతవరకూ మాన్పగలిగారు. కాని భర్త మరణం ఆవిడను కృంగదీసింది - ఇంక ఆ ఫ్లాట్‌లో ఉండలేకపోయింది. అదే మాట శారదతో అంది.

"అత్తయ్యా - మీరు ఇక్కడ నుంచి వెళ్లరు. వెళ్లనివ్వం. మీరు మా వాళ్లే".

"లేదమ్మా మీకు శ్రమ ఇవ్వలేనమ్మా"

"మాకు శ్రమ ఏమిటి? - నాకు తల్లి - శ్రేయకు బామ్మ - శారదకు అత్త". "మాతో పాటే మీరూను"

శ్రేయకు అర్థం కాలేదు అవన్నీ.

శారదా, ఆనంద్ ఎంతో బ్రతిమలాడారు ఆవిడను... వెళ్లొద్దని.

కానీ ఆమె ఒప్పుకోలేదు - ఫ్లాట్ అమ్మే సింది.

ఆవిడ ఆస్తులను అంతా ఒక కొలిక్కి తీసు కురావడానికి ఆనంద్ ఎంతో సహాయం చేశా డు. కొంత డబ్బు ఈ ఓల్డేజ్ హోమ్‌కి దానం చేసింది - ఆవిడా ఇక్కడ ఒక ట్రస్టీ.

తన గది తనకు కావలసిన విధంగా మార్చింది -

ఇప్పటికీ ఆనంద్, శారద ఆమెను బ్రతి మాలుతారు - వాళ్ల దగ్గర ఉండమని.

'చూడు నాయనా మీరు నాకు ఎప్పుడూ దగ్గరే. నా హృదయంలో ఉంటారు. మీరు వస్తూ వుండండి. నేనూ వస్తూవుంటాను. మిమ్మల్ని, శ్రేయనూ చూడకుండా ఒక్కరోజు ఉండగలనా?" అంటూ ఉంటుంది.

ఇదీ ఆమె కథ - ముగించింది సుబ్బలక్ష్మమ్మ.

అర్థంకాలేదు రంగనాయకమ్మకు - నిజమా, అబద్ధమా? అన్పించింది.

అంత ప్రశాంతమైన ముఖం వెనుక ఇంత విషాద గాథ ఉందని నమ్మలేకపోయింది. మనసులో, హృదయంలో అగ్ని పర్వతాలను పెట్టుకుని ఎంత నవ్వు ముఖంతో కన్పిస్తుంది? ఆమె గుండెలు కరిగించే విషాధ కథ ముందు - తన కష్టాలేపాటి?

శాంతమ్మ కథ ఊహించలేని నిజం... ఆమె కొడుకు, కోడలూ లేరు, మనుమరాలు లేదు... అయితే కొడుకు ఉన్నాడు, కోడలు ఉంది. మనుమరాలు ఉంది - లేనిది ఒకటే నుదిటి మీద బొట్టు. తీరని లోటు.

నాలుగైదు రోజులతరువాత తిరిగి వచ్చింది శాంతమ్మ.

రాగానే విన్నమాట - "రంగనాయకమ్మ గారు ఇంకలేరు" సుబ్బలక్ష్మమ్మ చెప్పింది.

"ఏమయింది?"

"రెండు రోజులు జ్వరం వచ్చింది. మేం కూతురి ఇంటికి ఫోన్ చేశాం. అల్లుడు ఫోన్ ఎత్తాడు.

"ముసలి వాళ్లకు చిన్న చిన్న నలతలు మామూలేకదండీ - రేపొద్దున్న వస్తాం. ఈ రాత్రి ఫ్లైట్‌కి కొడుకు, కోడలూ వెళ్లిపోతున్నారు అమెరికా" అని జవాబు చెప్పారు.

"డాక్టర్ని పిలిచాం"

వచ్చి చూసాడు "వయస్సు - ఎటు తిరిగినా తిరగవచ్చు" అన్నాడు.

మళ్లీ ఫోన్ చేస్తే ఎవరూ ఫోన్ ఎత్తలేదు. ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళారేమో.

"రంగనాయకమ్మగారు మామూలుగా అయిదు గంటలకు లేచే మనిషి - ఆరు గంటల వరకూ లేవలేదు. నేను లేపడానికి ప్రయత్నిస్తే - లేవలేదు - డాక్టరు వచ్చి చూసాడు - అంతా అయిపోయిందని చెప్పి వెళ్లిపోయారు. వెంటనే ఫోన్ చేసి వాళ్లకు చెప్పాం - పది గంటలకు వచ్చి భౌతికకాయాన్ని తీసుకువెళ్ళారు - ఇంటికో, ఎలక్ట్రికల్ క్రిమటోరియమ్‌కో తెలీదు"

ఇటువంటి సంఘటనలను ఎన్నో చూసిన శాంతమ్మగారికి కళ్లు చెమ్మగిల్లాయి. ఎలాంటి బ్రతుకు బ్రతికింది! చివరికి ఏ విధంగా ముగిసింది ఆమె జీవితం. ఆమెకు అందరూ ఉన్నారు - కూతుళ్లు, కొడుకు, అల్లుళ్లు, మనమలు, మనుమరాళ్లు, మునిమనుమలు - కాని ఆవిడ జీవిత ఆఖరి అధ్యాయంలో, ఆఖరి క్షణంలో దగ్గర ఎవరూ లేరు. ఆఖరికి దాహం తీర్చడానికి నోట్లో నీళ్లు పోయడానికి కూడా ఎవరూ దగ్గర లేరు.

ఇటువంటివి జీవితంలో ఎన్నో చూసింది...

ఆవిడ ఆశయం ఒకటే... తన కష్టాలను తనలోనే దాచుకోవాలి. ఇంకొకళ్లతో పంచుకోకూడదు. మన కన్నీటి చుక్కలను మరొకరికి ఇవ్వకూడదు - మన సంతోషాన్ని - మరొకరికి పంచి పెట్టాలి - కళ్లు తుడుచుకుంది. మొహం కడుక్కుంది - ఆమె దినచర్య - అదే సంతోషం పంచి పెట్టడం - ప్రారంభించింది.

ఎవరికీ తెలియని రహస్యం - శాంతమ్మగారికి ఒక్కరికే తెలిసిన నిజం - తన తరువాత తన ఆస్తంతా శ్రేయకు చెందాలని విల్లు వ్రాసిందనే విషయం. ●